క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాలు



గుడివాడ టౌన్: విద్యను ప్రోత్సహించేందుకు పూర్వపు దాతలు ఎన్నో విధాలుగా కృషిచేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషన్ అన్నారు. ఆదివారం స్థానిక కమ్మ సత్రంలో సత్రం ట్రస్ట్ సేవా కార్యక్రమాలలో భాగంగా 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున మొత్తం రూ.1,60,000 విద్య ప్రోత్సాహానికి అందజేశారు. ఈ సందర్భంగా శశిభూషన్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు భవిష్యత్ తరాలకు విద్య ద్వారా మేలు చేయాలనే సంకల్పంతో వారికున్న ఆస్తులను సత్రానికి వితరణగా ఇచ్చి, వాటి నుంచి వచ్చే ప్రతిఫలాలను ఈ విధంగా పేద విద్యార్థులకు అందజేస్తున్నార న్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు నటరాజన్ షణ్ముగం, గంగు శిరీష, ఎంపీపీ గద్దే పుష్పరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని ఆనంద్, బొప్పన రమేష్, వల్లపూడి నరసింహారావు, మోటూరి శివరామకృష్ణ, పాలడుగు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

శివాలయానికి నూతనశోభ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయం నూతన శోభను సంతరించుకుంటోంది. ఈ నెల 8న జరగనున్న శివరాత్రి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. గ్రామానికి చెందిన ఓరుగంటి నాగభూషణం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఓరుగంటి సుబ్బారావు, దుర్గ(హైదరాబాద్) దంపతులు రూ. 9.50 లక్షల వ్యయంతో ఆలయానికి రంగులు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన పనులు గత కొద్ది రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామిని భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శించుకున్నారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకుళంలోని గోవులకు పసుపు, కుంకుమలతో మహిళలు పూజలు చేశారు. ఆలయ ఈఓ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ పునఃప్రతిష్ట



మండవల్లి: మండవల్లి సెంటర్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 33 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠింపబడిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎన్‌హెచ్ విస్తరణలో భాగంగా మండల అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు ఆధ్వర్యంలో వేరే చోటికి మార్చారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, పి.అభిషా, రవి, వినోద్, తంబి, రాజేష్, గాంధీ పాల్గొన్నారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం



గుడ్లవల్లేరు: క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడటం వలన వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక దారుఢ్యం లభిస్తోందని గుడివాడ ఆర్డీఓ విజయసారథి అన్నారు. ఏఏఎస్ఎం అండ్ వీవీ ఆర్ఎస్ఆర్ హైస్కూల్ వార్షికోత్సవం కార్యక్రమానికి ఆదివారం ఆర్డీఓ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఆర్డీఓను హైస్కూల్ యాజమాన్యం వారు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ షో, కరాటే షో ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గుడ్లవల్లేరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఇంజినీరింగ్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, హెచ్ఎం జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పెన్షన్ అందజేత

నందివాడ: మండలంలోని పోలుకొండ గ్రామానికి చెందిన చప్పిడి యోహాను అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్‌ను గ్రామ వలంటీర్ దోమతోటి రూత్ మేరీ విజయవాడ ఆస్పత్రికి వెళ్లి యోహానుకు వికలాంగ పెన్షన్‌ను ఆదివారం అందజేశారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి



ఐలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: శివరాత్రి ఉత్సవాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సూచించారు. మండలంలోని ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 8న నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం సమీక్ష సమావేశం జరిగింది. తొలుత ఎమ్మెల్యే అనిల్‌కుమార్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి రామేశ్వరస్వామి, రఘునాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఫైర్, ఫిషరీస్, ఆర్టీసీ, పోలీస్, మెడికల్, ట్రాన్స్‌కో, సెబ్, దేవదాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఐలూరు గ్రామానికి సుమారు లక్ష మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు అవసరమైన జల్లు స్నానాలు, కృష్ణానదిలో నీడ కోసం షామియానాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, వైద్య సేవలు, భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి సూచించారు.

ఎమ్మెల్యే కైలే రూ. లక్ష విరాళం

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్ల కోసం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఎస్ఐ విశ్వనాథ్, ఈఓ జయశ్రీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్ పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం



తోట్లవల్లూరులో పోలియోచుక్కలు వేస్తున్న సర్పంచ్ రాధిక



ముదినేపల్లిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ



గుడివాడలో పోలియోచుక్కలు వేస్తున్న వైద్యులు, క్లబ్ సభ్యులు

తోట్లవల్లూరు: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ పెనుమత్స రాధిక పోలియోచుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐదేళ్ల లోపు వయసున్న 2,456 మంది చిన్నారులకు పోలియోచుక్కలను వేశారు. ఇంకా మిగిలివున్న చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది సోమ, మంగళవారం ఇంటింటికీ తిరిగి వేస్తారని డాక్టర్ మాధవి తెలిపారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

ముదినేపల్లి రూరల్: చిన్నారుల పాలిట శాపంగా పరిణమించే పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లిలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీపీ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, మీడియా సెల్ కన్వీనర్ పేర్ని పృథ్వీ, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, పైడిపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయినట్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పీపీ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ సుదర్శనరావు ఆదివారం అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది, రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పల్స్ పోలియో విజయవంతం చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద, అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాల వద్ద పోలియో చుక్కలు వేసేందుకు వైద్యులు, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారన్నారు. మొత్తం 95 శాతం లక్ష్యాన్ని పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసపత్రి వైద్యులు డాక్టర్ అనూరాధ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ కెజియా రాణి, డాక్టర్ డేవిడ్ ట్విన్సన్, డాక్టర్ సుష్మాభారతి, డాక్టర్ యోగానందరావు, రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షుడు రావి శ్రీహర్ష, డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఎస్వై మాధవ కుమార్, గుళ్లపల్లి కిరణ్, తుమ్మల శ్రీనివాస్, వై సుహాస్ పాల్గొన్నారు.

దొండపాడులో..

గుడివాడరూరల్: సమాజంలో పోలియో శాశ్వత నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించి తరిమికొట్టాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండలంలోని దొండపాడు సచివాలయం వద్ద పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. తొలుత చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నాయకుడు గద్దే రాము తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక బాపూజీ పేటలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, స్థానిక 14వ వార్డులోని పోలియో కేంద్రంలో గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి పలువురు చిన్నారులకు పోలియో నివారణ చుక్కలను వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని 42 కేంద్రాల్లో, కూచిపూడి, మొవ్వ ఆర్‌టీసీ బస్టాండుల్లో ఓ మొబైల్ టీమ్ ద్వారా చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలను అందించారు. కూచిపూడి బస్టాండ్‌లో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా రోటరీ అధ్యక్షులు కత్తిక రామాంజనేయులు, సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిబొట్ల ఆనంద్, సాయి ఆరోగ్య హాస్పిటల్స్ డైరెక్టర్ సూర్య హాజరై పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ వేదరాజ్, డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి, రోటరీ కార్యదర్శి రవిబాబు పాల్గొన్నారు.

నిమ్మకూరులో..

నిమ్మకూరు(పామర్రు): పోలియో రహిత సమాజమే లక్ష్యంగా అందరం కలిసి కృషి చేయాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో నివారణ చుక్కలకు ఆదివారం వేశారు.

కార్యక్రమంలో కురుమద్దాలి సర్పంచ్ గోత్రు విజయభారతి, వైద్యులు రవి రాము, చరణ్‌తేజ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని పెదపారుపూడి ఎంపీపీ గోగమ్ సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల-1లో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రామానికి ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ హాజరై పరిస్థితిని సమీక్షించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ బాబీ, పీహెచ్‌సీ డాక్టర్ ఎం.అనిలా పాల్గొన్నారు.

కనుల పండువలా గంగానమ్మ జాతర

ముగిసిన ఉత్సవాలు



ఆలయంలో భక్తులకు దర్శనమిచ్చిన గంగానమ్మ అమ్మవారు

పామర్రు: ఆరు రోజులుగా నిర్వహిస్తున్న గంగానమ్మ జాతర ఆదివారం కనుల పండువలా సాగింది. రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామస్తులు తమ పశువులను, వాహనాలను, ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి చద్ది నివేదనలను తమ వెంట తెచ్చి ఆలయంలో సమర్పించారు. తొలుత ఆలయం నుంచి అమ్మవారిని మేళ తాళాలతో డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేరల వద్దకు చేరుకుని తొలి రోజున పొలిమేరల్లో కట్టిన రక్షలను తొలగించేశారు. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు రాత్రి 10 గంటల వరకూ ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు బొండా నాగేశ్వరరావు, కొనసాని శివ శంకరరావు వితరణతో 10వేల వాటర్ ప్యాకెట్‌లను అందజేశారు. ఆలయ కమిటీ ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, సభ్యులు నందిపాటి బాలసుబ్రమణ్యేశ్వరరెడ్డి, డి.బాల వెంకటేశ్వరెడ్డి, బి.రాజేష్ రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మున్నంగి వెంకటరెడ్డి, బాల వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

సచివాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన

మండవల్లి: పెరికెగూడెం జగనన్న కాలనీలో గ్రామ సచివాలయ భవన నిర్మాణంలో భాగంగా శ్లాబ్ పనులను సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆదివారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ పిండి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి ఉన్న జగన్‌ను ఆశీర్వదించాలి



సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

మండవల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా భావించి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ(జేవీఆర్) అన్నారు. మండలంలోని పులపర్రులో ఆదివారం 14వ రోజు ప్రజా ఆశీర్వాదయాత్రలో వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న తాగునీరు, శ్మశానవాటిక సమస్యలు త్వరలో పరిష్కరిస్తామన్నారు. తొలుత రూ.20 లక్షలు గడప గడపకు ప్రభుత్వం నిధులతో నిర్మితమైన సీసీ రోడ్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం మాటా ఇస్తే కట్టుబడి ఉంటుందన్నారు. కులం, మతం, వర్గం, పార్టీ అజెండానే లేకుండా చెప్పిన సంక్షేమ పథకాలు చెప్పిన సమయానికే సేవలు అందజేస్తున్న జగన్ అందరికీ కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ అగస్టీ ఆదివిష్ణు, కొల్లాటి సత్యనారాయణ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ముంగర మల్లికార్జునరావు, గుడివాడ తమ్మిస్వామి, మెండా సురేష్, సర్పంచ్ జయమంగళ కాసులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



పీఏసీఎస్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: రైతు సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరులో రూ. 56.25 లక్షల వ్యయంతో నిర్మించిన నార్తువల్లూరు పీఏసీఎస్ కార్యాలయ నూతన భవనం, గోదామును కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి ఆదివారం ప్రారంభించారు. అలాగే భద్రిరాజుపాలెం పీఏసీఎస్‌లో 438 మంది రైతులకు రూ. 19.51 లక్షల డివిడెండ్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ నాయకులు చేసే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, విలువలు, విశ్వసనీయత ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, అండగా ఉండాలన్నారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి కృషి

పీఏసీఎస్‌లను బలోపేతం చేయటం ద్వారా రైతులకు అన్ని విధాలా అండగా ఉండటానికి కృషి చేస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి తెలిపారు. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పీఏసీఎస్‌లకు నూతన భవనాలు, ఎరువుల కోసం గోదాములు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు పడమట హరిప్రసాద్, చాగంటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

మండవల్లి: వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక క్రియాశీలక సభ్యులు కె.మార్కురాజు, బి.రంగారావు, జి.విజయరమేష్‌కుమార్, రామచంద్రరావు, శ్రీనివాసరావు, అదృష్టరావు పాల్గొన్నారు.

మైనార్టీలు, బీసీలకు పెద్దపీట



ఆబూకు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

- ఎమ్మెల్యే కొడాలి నాని
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకుడు ఆబూ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ముస్లిం మైనార్టీ నాయకుడు, టీడీపీ క్రియాశీల సభ్యుడు మహ్మద్ ఖాసీం(ఆబూ) ఆదివారం కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. పట్టణంలోని ముస్లిం మైనార్టీలు అధికంగా నివసించే 10, 11, 12 వార్డుల్లో మంచి పట్టున్న ఆబూ టీడీపీకి షాక్ ఇస్తూ వైఎస్సార్ సీపీలో చేరారు. తొలుత స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం నుంచి తన అనుచరులతో పట్టణంలోని నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్ మీదుగా బంటుమిల్లి రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కొడాలి నాని ఆబూను మోటార్ సైకిల్ ఎక్కించుకుని ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీసీలు, మైనార్టీలను గుర్తించి వారికి రాజ్యాధికారం ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వాన్ని నడుపుతున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో రూ.100 కోట్ల లోపు పెన్షన్‌లు ఇస్తే ఇప్పుడు రూ.540 కోట్లు ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నాయుడు 12 శాతం కూడా పూర్తి చేయని టిడ్కో ఇళ్లను రూ. 850 కోట్లు ఖర్చుచేసి 8,912 మంది లబ్ధిదారులకు అన్ని వసతులతో అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడానికి అందరూ సహకరించాలన్నారు. ఆబూ మాట్లాడుతూ కొడాలి నానీని తిరిగి ఎమ్మెల్యేగా చెయ్యడమే తన లక్ష్యమన్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో మెజార్టీ తెచ్చి తన సత్తా ఏంటో టీడీపీ నాయకులకు తెలియజేస్తానన్నారు. కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అయ్యప్పన్, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి నారాయణరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.కాళీ, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు శశిభూషన్, రామ్‌ప్రసాద్, చంటి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు బాజీ, సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్, మైనార్టీ నాయకులు అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

మంచి చేస్తేనే అవకాశం ఇవ్వండి

ఎమ్మెల్యే డీఎన్నార్



వైఎస్సార్ సీపీలో చేరుతున్న ముస్లింలకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు మంచి చేస్తేనే తిరిగి మరో పర్యాయం సేవ చేసే అవకావం కల్పించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ప్రజల సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రారంభించిన గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం మూడో రోజు 2వ సచివాలయం పరిధి 12, 13 వార్డులలో ఆదివారం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, రాష్ట్ర, జిల్లా ముస్లీం మైనార్టీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, జిల్లా వైయస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, శ్రీరామలింగేశ్వర దేవస్థాన చైర్మన్ బూరుబోయిన మోహనరావు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవల పట్ల ఆకర్షితులపై పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. జిల్లా ముస్లీం మైనార్టీ నాయకులు షేక్ రఫీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీఎన్నార్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహమ్మద్ రిజ్వాన, షేక్ అమీర్, ఖాదర్‌బాబు, మహమ్మద్ అలీమ్, ఇమ్రాన్‌ఖాన్, మహమ్మద్ సలామ్, మహమ్మద్ అజీజుల్లా, షేక్ రహమాన్, అక్రమ్, కలిదిండి రహమాన్, షేక్ సుభాని, ఆరీఫ్ ఉన్నారు.

నేడు పెద్దింట్లమ్మ జాతరపై సమీక్ష

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర(తీర్థం) నిర్వహణ నిమిత్తం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఏలూరు ఆర్డీఓ ఎస్‌కే.ఖాజావలి అధ్యక్షతన దేవాలయం వద్ద సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ కేవీ గోపాలరావు ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొంటారని పేర్కొన్నారు.

ముగిసిన మరియమాత మహోత్సవాలు

కలిదిండి: మరియమాత వార్షిక మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ నెల 1న ప్రారంభమైన మహోత్సవాలకు నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి వేలాది మంది క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చివరి రోజు సమష్టి దివ్య పూజాబలి సమర్పణ, జపమాల కార్యక్రమాలు జరిగాయి. కలిదిండి విచారణకర్త, ఫాదర్ బంటుమిల్లి యోహాను, విజయవాడ నేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి. జోసెఫ్ రాజారావు, ఆధ్వర్యంలో మరియమాత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గుడివాడ డివిజన్

99516 02865 (గుడివాడ)

99516 02985 (కైకలూరు)

90105 77706 (పామర్రు)

Office mail : sakshiads@gmail.com